# మృతులు ఎక్కడ ఉన్నారు?

## (లూకా 16:19-31)

"మృతులు ఎక్కడున్నారు?" అనే ప్రశ్న అనేకులకు ఆసక్తిని కలిగిస్తుంది. మనం తెలుసుకోవలసింది చాలా ఉంది: మరణించిన వెంటనే మనం ఎక్కడికి వెళ్లతాం, మనలను విడిచివెళ్లిన స్నేహితులు స్పృహ కలిగి ఉంటారా, లేదా, వారు వెళ్లిపోవడంవలన మనకు కలిగిన దుఃఖం మన ప్రియులకు తెలుసా,[1] లేదా వగైరాలకు జవాబులు తెలిసికో గోరతాం. వీటిలో కొన్ని ప్రశ్నలకు మనం జవాబు చెప్పలేం. తరువాత జీవితం విషయంలో కొన్ని సంగతులు మర్మంగా ఉంచడం దేవునికి యిష్టమయ్యింది.

మరణానంతర జీవితాన్ని గూర్చిన మన తెలివిని పరిమితిలో ఉంచడమందు దేవునికి కృపగల ఉద్దేశం ఉన్నట్టు నేను నమ్ముతాను. మనలను విడిచివెళ్లిన మన ప్రియులు మనకు సమీపంగా ఉండి, మనం అనేది చేసేది అంతా కనిపెట్టుతున్నారని నమ్మడం అసౌకర్యంగా ఉండదా? నన్ను అపార్థం చేసికోకండి: అలా జరుగుతుందని నేను అనడం లేదు. నేనేమంటున్నానంటే, అలా జరిగిందే అనుకో, మనలను కనిపెట్టుతున్నారు లేక గమనిస్తున్నారనే భావన అనేకులకు అసౌకర్యంగా ఉంటుంది.

ప్రాథమికంగా, ఒక్కోసారి ఒక్కోలోకంలో మనం జీవించాలని ప్రభువు కోరుకొంటు న్నారు. తరువాత జీవితపు వివరాలపైననే మనం ఈ లోకమందు జీవించడం తటస్థించినట్టయితే, అది, ఈ జీవిత కాలపు అభ్యాస సంబంధమైన విషయాలలో మనలను అయోగ్యులనుగా చేయవచ్చు, రాబోవు లోకాన్ని గూర్చిన కొన్ని వివరాలను మన నుండి దూరంగా ఉంచాలనేది తండ్రికి అభీష్టమైయున్నందున (ద్వితీయో. 29:29 చూడు), మనం బయలుపరచబడినదానితో సంతుష్టి చెంది, "నీ చిత్తమే సిద్ధించుగాక" అంటూ పోదాం (మత్తయి 26:42).

ఏదియెలాగున్నా, దేవుడు ఈ విషయాన్ని గూర్చి ఏమి బయలుపరచారో, దాన్ని తెలిసికొనే హక్కు మనకుంది. "మృతులు ఎక్కడ?" అనే ప్రశ్నకు బైబిలు జవాబును కనుగొనడానికి, క్రీస్తు ప్రభువు తెలిపిన ఒక కథను మనం చదువుదాం:

> ధనవంతుడొకడుండెను అతడు ఊదారంగు బట్టలును సన్నపు నార వస్త్రములును ధరించుకొని ప్రతి దినము బహుగా సుఖపడుచుండువాడు. లాజరు[2] అను ఒక దరిద్రు డుండెను. వాడు కురుపులతో నిండినవాడై ధనవంతుని యింటి వాకిట పడియుండి అతని బల్లమీదనుండి పడు రొట్టె ముక్కలతో ఆకలి తీర్చుకొన గోరెను; అంతేకాక కుక్కలు వచ్చి వాని కురుపులు నాకెను. ఆ దరిద్రుడు చనిపోయి దేవదూతలచేత అబ్రాహాము రొమ్మున (ఆనుకొనుటకు) కొనిపోబడెను. ధనవంతుడు కూడ చనిపోయి పాతిపెట్టబడెను. అప్పుడతడు పాతాళములో బాధపడుచు, కన్నులెత్తి దూరమునుండి అబ్రాహామును అతని రొమ్మున (ఆనుకొనియున్న) లాజరును చూచి – తండ్రివైన

అబ్రాహామా, నాయందు కనికరపడి, తన వ్రేలికొనను నీళ్లలో ముంచి నా నాలుకను చల్లార్చుటకు లాజరును పంపుము; నేను ఈ అగ్ని జ్వాలలో యాతనపడుచున్నానని కేకలు వేసి చెప్పెను. అందుకు అబ్రాహాము – కుమారుడా, నీవు నీ జీవితకాలమందు నీకిష్టమైనట్టు సుఖము అనుభవించితివి, ఆలాగుననే లాజరు కష్టము అనుభవించెనని జ్ఞాపకము చేసికొనుము; ఇప్పుడైతే వాడు ఇక్కడ నెమ్మది పొందుచున్నాడు, నీవు యాతన పడుచున్నావు. అంతేకాక ఇక్కడనుండి మీయొద్దకు దాటుగోరువారు దాటి పోజాలకుండునట్లును, అక్కడివారు మాయొద్దకు దాటి రాజాలకుండునట్లును, మాకును మీకును మధ్య మహా అగాధముంచబడియున్నదని చెప్పెను. అప్పుడతడు – తండ్రీ, అలాగైతే నా కయిదుగురు సహోదరులున్నారు. వారును ఈ వేదనకరమైన స్థలమునకు రాకుండ వారికి సాక్ష్యమిచ్చుటకై నా తండ్రియింటికి వాని పంపవలెనని నిన్ను వేడుకొనుచున్నాననెను. అందుకు అబ్రాహాము – వారియొద్ద మోషేయు ప్రవక్తలును ఉన్నారు; వారి మాటలు వినవలెనని అతనితో చెప్పగా అతడు – తండ్రివైన అబ్రాహామా, అలాగు అనవద్దు; మృతులలోనుండి ఒకడు వారియొద్దకు వెళ్లినయెడల వారు మారుమనస్సు పొందుదురని చెప్పెను. అందుకతడు – మోషేయు ప్రవక్తలును (చెప్పిన మాటలు) వారు విననియెడల మృతులలోనుండి ఒకడు లేచినను వారు నమ్మరని అతనితో చెప్పెను (లూకా 16:19–31).

ఈ లేఖన భాగంనుండి అనేక పాఠాలు ఏరుకోవచ్చు,[3] ఈ ప్రసంగంలో, మనం ఒకే ఒక ప్రశ్నను ఆలోచన చేద్దాం: మృతుల స్థితిని గూర్చి ఈ లేఖన భాగం ఏమి బోధిస్తుంది?

“ఈ రచనలలోనుండి,” ఏ తీర్మానాన్నీ చేయలేము, “ఎందుకంటె మరణానంతరపు జీవితాన్ని గురించి పైన చెప్పిన కథ నిర్దిష్టమైన సంగతి చెప్పదు అంటూ కొందరు ఆక్షేపణ తెలుపవచ్చు.” ఇది ఉపమానమైయుంటే, ఇది ఉపమానాల సాధారణమైన నమూనాకు సరిపోదు.[4] ఉదాహరణకు, ఈ కథలోని పాత్రలలో ఒకని: “లాజరు” అని ప్రభువు పేరు పెట్టి పిలిచారు. నేను ఎరిగినంత మట్టుకు, ఆయన ఈలాగు ఏ ఉపమానంలోనూ చెప్పలేదు. పైగా, ఆత్మసంబంధమైన ఒక పాఠం నేర్పించడానికి పలువురు ఎరిగిన సంభవాన్ని చెప్పడం ఉపమానంలోని ప్రాథమిక ఉద్దేశం. మృతుల స్థితితో సరాసరి శ్రోత పరిచయంగలవాడనేది నా సందేహం. లభ్యమయ్యే వాస్తవాలనుబట్టి యిది ఉపమానం కాదని, తన సందేశాన్ని మనుష్యులకు అందజేయడంలో ప్రభువు ఒక నిజ జీవిత గాథను ఉపయోగిస్తున్నారని తెలుస్తుంది.[5]

మరోవైపు, యిది ఉపమానమని ఒప్పుకుంటే ఏమౌతుంది? దాని నిజాలకు సంబంధించి కొంత తేడా వస్తుంది. “ఉపమానమంటే” “కట్టు కథ” అని అర్థం కాదు. ఒక నిజ జీవితపు పరిస్థితిని తీసికొని, ఆత్మ సంబంధమైన వర్తింపుకు సమాంతరం చేసేది ఉపమానం.[6] లూకా 16:19–31ని ఉపమానమని నేను నమ్మను – కాని, ఒకవేళ అది ఉపమానమైయున్నా కూడా, దేహములు విడిచిన ఆత్మలకు ఏమి జరుగుతుందో అనేదానికి అది హెచ్చుతగ్గులు లేని వర్ణనయై ఉంది.

గనుక, “మృతులు ఎక్కడ ఉన్నారు?”[7] అనే ప్రశ్నకు దేవుని జవాబుతో ప్రాథమిక రిఫరెన్సుగా ధనవంతుడు లాజరు కథను మనం ఉపయోగించుకొనవచ్చు అని నేను ఒప్పింపబడ్డాను.

## మృతులు ఏదోయొక చోట ఉన్నారు

## వారు స్పృహతో ఉన్నారు

"మృతులు ఎక్కడున్నారు?" అనే ప్రశ్నకు – "వారెక్కడా లేరు"[8] అని కొందరు బదులిస్తారు. భూనివాస కాలం తరువాత జీవితం లేదని వారు నమ్ముతారు. జీవితమనేది ఒక పరమాంతాన్ని కలిగిన ఒకే దారిగా వారు నమ్ముతారు. ఏదియెలాగున్నా, లూకా 16 ఉపదేశించేది ఏమైనా ఉంటే, మరణానంతరం నరుడు జీవిస్తాడని ఉపదేశిస్తుంది.

ఈ జీవితకాలం తరువాత జీవితాన్ని నమ్మే యితరులు, మరణానంతరం మనిషి ఉనికి లేకుండపోతాడు (దేవుని జ్ఞాపకంలో మాత్రమే "ఉంటాడు") – ఏదోయొక రోజున "పునరుత్థాన"ముంటుంది (నిజానికి – తిరిగి సృష్టి), ఆ సమయంలో నీతిమంతులకు అమరత్వం ప్రసాదింపబడుతుంది, దుష్టులు రూపుమాపబడతారని వారి నమ్మకం. మరణమందు ధనవంతుడు గాని, లాజరు గాని ఉనికిలో లేకుండపోలేదు. ఇద్దరును జీవించుతూ, స్పృహ కలిగి ఉన్నారు.

ముందుగా ప్రస్తావించబడిన రెండు సిద్ధాంతాలను ఉపదేశించేవారితో నేను చేసిన చర్చలో, "మరణము" అనేదానిమీద వారు ఆట ఆడతారు. వారేమంటారంటే, మరణానంతరం ఆత్మ జీవిస్తున్నట్టయితే, మరణమే లేదని వారంటారు. "మరణం" అనేదాన్ని నిర్వచించుమని నేను వారిని అడుగుతాను. వారి మనస్సుల్లో "మరణ"మంటే "అంతరించడమనే!" అయితే అలాటి నిర్వచనంతో ఈ క్రింది లేఖన భాగాలను సమన్వయ పరచడం కష్టం:

- రోమా 7:9లో పౌలు యిలా అన్నాడు: "ఒకప్పుడు నేను ధర్మశాస్త్రము లేకుండ జీవించుచుంటిని గాని, ఆజ్ఞ వచ్చినప్పుడు పాపమునకు మరల జీవము వచ్చెను; నేనైతే చనిపోతిని." అపొస్తలుడు ఉనికిలో లేకుండ అంతరించిపోయాడా?
- కొలస్సీ. 3:3లో పౌలు యిలా రాశాడు: "ఏలయనగా మీరు మృతిపొందితిరి, మీ జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడియున్నది." అతని పాఠకులు అంతరించిపోయారా?
- 1 తిమోతి 5:6లో అతడిలా చెప్పాడు: "సుఖభోగములయందు ప్రవర్తించునది బ్రదుకుచుండియు చచ్చినదైయుండును." ఆలాటి స్త్రీ అంతరించిపోలేదు.

"మరణమనేది" ప్రాథమికంగా "ఎడబాటును" సూచిస్తుంది.[9] స్థితి యొక్క అంతము – అంతేగాని అంతరించిపోడాన్ని ఆ పదము సూచించదు.

వాస్తవానికి, ముందుగా సూచింపబడిన భావాలను కలిగియున్నవారు మనిషిలో ఉన్న అమరత్వపు భాగమైన ఆత్మను లేదంటారు. "ఆత్మ అనేది కేవలం మనలో ఉన్న భౌతికమైన ప్రాణమ"ని వారంటారు. "ప్రాణము" (*psuche*) అనే గ్రీకు పదానికి "దేహాన్ని

బ్రదికించే ప్రాణాన్ని సూచిస్తుంది. ఇది శరీరమునకు వేరుగా ఉండి, మరణమందు కరిగిపోతుంది."[10] అలాగే "ఆత్మకు" గ్రీకు పదం (*pneuma*) గాలి, ఊపిరి, ఈ శరీరాన్ని ప్రాణిగా రూపకల్పన చేయబడే ప్రధాన సూత్రము. "నరునిలో అమరత్వము గల భాగమిది ... ఎరుగ గలిగిన, కోరగల, తీర్మానించగల శక్తి ... మానవ దేహాన్ని విడిచి స్వతంత్రంగా ఉండగల శక్తి."[11]

నరుడు రెండు భాగముల సమ్మేళనమైన జీవియనియు, శరీరము ఉనికిలో లేకుండ అంతరించినప్పుడు, ఆత్మ నివసిస్తుందని సూచించే అనేక లేఖన భాగాలున్నాయి. ఈ క్రింద కొన్ని చూపించబడ్డాయి:

> మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవునియొద్దకు మరల పోవును (ప్రసంగి 12:7).
>
> పశ్చాత్తాపపడిన దొంగతో క్రీస్తు: " – నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను" (లూకా 23:43).
>
> అప్పుడు యేసు గొప్ప శబ్దముతో కేకవేసి – తండ్రీ, నీచేతికి నా ఆత్మను అప్పగించు కొనుచున్నాననెను. ఆయన ఆలాగు చెప్పి ప్రాణము విడిచెను" (లూకా 23:46).
>
> ప్రభువును గూర్చి మొరపెట్టుచు – యేసు ప్రభువా, నా ఆత్మను చేర్చుకొనుమని స్తెఫను పలుకుచుండగా వారు అతనిని రాళ్లతో కొట్టిరి (అపొ. 7:59).
>
> కావున మేము అధైర్యపడము; మా బాహ్య పురుషుడు కృశించుచున్నను, ఆంతర్య పురుషుడు దినదినము నూతన పరచబడుచున్నాడు ...
>
> భూమిమీద మన గుడారమైన ఈ నివాసము శిథిలమై పోయినను, చేతి పనికాక దేవుని చేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము ... గనుక ఈ దేహములో నివసించుచున్నంత కాలము ప్రభువునకు దూరముగా ఉన్నామని యెరిగి యుండియు ఎల్లప్పుడు ధైర్యముగలవారమై యున్నాము. ఇట్లు ధైర్యము గలిగి యీ దేహమును విడిచిపెట్టి ప్రభువునొద్ద నివసించుటకు ఇష్టపడుచున్నాము (2 కొరింథీ. 4:16–5:8).

మన ఆత్మలను మనం ఎక్కడనుండి పొందాం? దేవుడు "ఆత్మలకు తండ్రియై" యున్నట్టు బైబిలు చెప్తుతుంది (హెబ్రీ. 12:9). "మనుష్యుల అంతరంగములో జీవాత్మను సృజించు యెహోవా" అని ప్రవక్తయైన జెకర్యా అన్నాడు (జెకర్యా 12:1).

"మృతులెక్కడ ఉన్నారు?" అనే ప్రశ్నకు మన మొదటి జవాబు, "వారు ఎక్కడో ఉన్నారు, మరియు వారు స్పృహ కలిగియున్నారు" అనేది. ఏదియెలాగున్నా, ఈ లేఖన భాగములో మనం నేర్చుకోవలసింది ఎంతో ఉంది.

# మృతులు భూమిమీద నూతన దేహాల్లో పునర్జన్మించలేదు

పునర్జన్మమివ్వబడుతుందనే సిద్ధాంతం (ఏమంటుందంటే) మరణానంతరం ఒకని ఆత్మ నూతన రూపంలో లేక దేహంలో తిరిగి వస్తుందని నమ్ముతుంది. ఇది అనేక తూర్పు దేశాల నమ్మకమైయుంది. ఈ సిద్ధాంతం బోధించే దేశాలలో ఆవులు, కోతులు, లేక పాములు పవిత్రమైన జంతువులుగా పరిగణింపబడతాయి. ఈ రూపాల్లో ప్రజల యొక్క పితరులు పునర్జన్మించారని వారు నమ్ముతారు. ఈ పునర్జన్మమిచ్చే భావాన్ని యూదులలో కొందరు మరో రూపంలో విశ్వసించారు (మత్తయి 16:13, 14 చూడు) – ఈ భావన ఆయా సమయాల్లో పాశ్చాత్య దేశాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది.

ఏదియెలాగున్నా, లూకా 16లోని లాజరు, ధనవంతుడు అనేవారు నూతన రూపాల్లో గాని నూతన దేహాల్లోగాని భూమిమీదికి తిరిగిరాలేదు, వారింకను వారుగానే ఉన్నారు. మరియు, వారి స్థితి స్థిరపరచబడినట్టు లేఖనం నొక్కి చెప్పుతుంది. 26వ వచనం యిలా అంటుంది: "అంతేకాక ఇక్కడనుండి మీ యొద్దకు దాట గోరువారు దాటి పోజాలకుండునట్లును, అక్కడివారు మీయొద్దకు దాటి రాజాలకుండునట్లును, మాకును, మీకును మధ్య మహా అగాధముంచబడియున్నదని చెప్పెను." వారిలో ఎవరును మరి ఏ రూపంలోను తిరిగి రాజాలరని అబ్రాహాము మాటలు స్పష్టం చేస్తున్నాయి.

ఊహానిర్మిత కథలను పునర్జన్మకు సంబంధించిన వార్తా పత్రికలు చెప్పినప్పుడు నేను ఉల్లాసంతో గంతులు వేయబోయేదేమి లేదు. నా జీవితంలో నాకు ఒక న్యాయ నిర్ణయ ప్రమాణం ఉంది – అది బైబిలు. క్రొత్త ఐడియాలు రమ్యంగానే ఉంటాయి, కాని నేను వాటికి వర్తింపజేసే పరీక్ష యిది: దేవుని వాక్య సందేశానికి అది ఎలా తూగుతుంది? బహు సాధారణమైన సత్యం ఏమంటే, చచ్చినవారు మరో రూపంలో జన్మిస్తారనే సిద్ధాంతం బైబిల్లో బోధింపబడలేదు.

కొన్ని ప్రాథమిక బైబిలు సూత్రాలను గమనించు:

- ప్రసంగి 3:2. "చచ్చుటకు ... సమయము కలదు" (ఏకవచనం).
- హెబ్రీ. 9:27. "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును."
- ప్రసంగి 12:7. "... ఆత్మ దాని దయచేసిన దేవునియొద్దకు మరల పోవును" మరో దేహంలోనికి కాదు.
- 2 కొరింథీ. 5:10. "ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించినవాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును."

చనిపోయిన వ్యక్తి మరో జన్మ ఎత్తి భూమిమీద నివసిస్తాడనే సిద్ధాంతాన్ని బైబిలు

బోధించలేదు. గనుక, దాన్ని విశ్వాసంతో అంగీకరించ వల్లపడదు (రోమా 10:17 చూడు). ఆ సిద్ధాంతం తప్పని లూకా 16 తేటగా బోధిస్తుంది.

## మృతులు నేరుగా తమ నిత్య బహుమానాలకు వెళ్లలేదు

మరణించిన తోడనే జనులు పరలోకానికి గాని నరకానికి గాని నేరుగా వెళ్లతారని కొందరు తలంచుతారు. ధనవంతుడు గాని లాజరు గాని ఆలాటి తుట్టతుది స్థితికి చేరుకోలేదు (ఇది తరువాత మన స్టడీలో గమనించుదాం).[12]

మరణ సమయంలోనే జనులు నేరుగా తమ నిత్య బహుమానాలకు వెళ్లు తున్నట్టయితే, తీర్పు దినాన్ని గూర్చిన బైబిలు బోధను యిది ఎక్కువగా చెల్లకుండ చేస్తుంది. మంచివారేమి చెడ్డవారేమి సకల జనులు తీర్పుతీర్చబడే దినం ఒకటి నియమింపబడి యున్నట్టు బైబిలు బోధిస్తుంది (మత్తయి 25:31, 32; యోహాను 16:8; అపో. 17:31; హెబ్రీ. 6:2; 9:27; అపో. 24:25). ప్రభువు రాకముందు చనిపోయినవారు సయితం ఈ తీర్పులో చేర్చబడతారు (మత్తయి 12:41, 42 చూడు). (మృతులైన) "దుర్నీతి పరులను ... శిక్షలో ఉంచబడినవారిని తీర్పు దినమువరకు కావలిలో ఉంచుటకు ప్రభువు సమర్థుడు" అని పేతురు రాశాడు (2 పేతురు 2:9–10). తీర్పును గూర్చిన బైబిలు ఉపదేశ క్రమమేమంటే – ప్రభువు తిరిగివచ్చునప్పుడు, మృతులు సజీవులు అందరు లేపబడి దేవుని యెదుట నిలబెట్టబడతారు – అనేది. ఏది కాకపోయినా, మరణం వెంటనే నరులు నరకానికో పరలోకానికో వెళ్లడమనేది జరగని పని – వారు నరకంలోనో, పరలోకంలోనో మరణంతోనే ఉండిపోతే, తీర్పుకు వారిని బయిటికి తెచ్చి, తిరిగి అదే చోట్లకు పంపడం జరుగుతుందంటే సబబుగా ఉండదు.[13]

నీతిమంతులు వెంటనే తమ బహుమానాలను అందుకోబోతున్నట్టు రెండు లేఖనాలు కన్పిస్తాయి. పౌలు కొరింథీయులతో మాట్లాడుతూ, "... యీ దేహమును విడిచిపెట్టి ప్రభువునొద్ద నివసించుటకు ఇష్టపడుచున్నాము" అని అన్నాడు (2 కొరింథీ. 5:8). మరల అతడు ఫిలిప్పీయులకు రాస్తూ, "నేను వెడలిపోయి క్రీస్తుతోకూడ నుండవలెనని నాకు ఆశయున్నది ..." అని తెలిపాడు (ఫిలిప్పీ. 1:23). అయితే ఈ లేఖన భాగముల ఉద్దేశం, మృతుల అంతిమ స్థితిని గూర్చి ఉపదేశించడం కాదు. నీతిమంతులకు మరణమందు విజయముందని సూచించడానికి ఉద్దేశించబడ్డాయి. నీతిమంతులు "క్రీస్తుతో ఉండేది," ఆయన ప్రేమచే ఆవరింపబడడంతోనే, గాని వారు నేరుగా పరలోకం వెళ్లతారనే ఉద్దేశంతో చెప్పబడలేదు.[14]

పౌలు మరణించినప్పుడు, "ప్రభువుతో ఉండడానికి" అతడు వెళ్లాడు, కాని అతడు పరలోకంలో తన కిరీటాన్ని యింకను పొందలేదు. ఇతరులకు తమ ప్రేమలో పాలు యిచ్చినవారు (లూకా 14:12, 13), పునరుత్థానంలో "ప్రతిఫలం" పొందుతారని ప్రభువు బోధించారేగాని (లూకా 14:14), మరణ సమయంలో కాదు. "నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని

పోవుదును" అని చెప్పిన ప్రభువు పలుకులను తన రెండవ రాకడకు ఆయన సూచించినట్టు ఎక్కువమంది పండితులు నమ్ముతారు (యోహాను 14:3). తన నీతి కిరీటాన్ని గూర్చి పౌలు యిలా రాశాడు: "ఇకమీదట నా కొరకు నీతికిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించు వారికందరికిని అనుగ్రహించును" (2 తిమోతి 4:8) "ఆ దినమందు" అనే ప్రయోగాన్ని గమనించు, ప్రభువుయొక్క ప్రత్యక్షతను అపేక్షించేవారి కందరికిని అదే రోజున అదే కిరీటము లభిస్తుంది. సందర్భంలో, అది తీర్పు దినమై యుండాలి.

ఇంతవరకు, లూకా 16లో ఉన్న కథకు లేదనే పంథాలోనే ఎక్కువ భాగం నేను చర్చించాను. మృతులు ఎక్కడా లేరనే పలు రకాలైన నమ్మకాలను నిరాకరించాను. వారు తిరిగి భూమిమీదికి మరొక రూపంలో రారని; వారు అంతములోనే పరలోకంలో గాని నరకంలోగాని ప్రవేశింపలేరనియు కూడ చర్చించాను. అయితే ప్రశ్న యింకా మిగిలే ఉంది: అప్పుడు, "యింతకు మృతులు ఎక్కడ ఉన్నట్టు?" లూకా 16ను ఎక్కువ నిశ్చయమైన విధానంలో పరిశీలించబోదాం.


## మృతులు తీర్పుకై వేచియుండి
## మధ్యస్థ స్థితిలో ఉంటారు

లూకా 16లో వర్ణింపబడిన అదృశ్య లోకాన్ని పటాల రూపంలో ప్రదర్శించడానికి కాలక్రమంలో సువార్తికులు ప్రయత్నించారు. ఆలాటి పటాలలో ఉన్న బలహీనత ఏమంటే, అది ఒక స్థలము అన్నట్టు అవి సూచింపబడ్డాయి, అది తప్పు, పాతాళము అనేది స్థలం కాదు గాని, అది ఉన్న స్థితి. కథలో చిత్రింపబడ్డ వివిధ పరిస్థితులను బలీయంగా చూపడానికి నాకు తెలియదు. అందునుబట్టి, లూకా 16లో కన్పించే పేర్లను ఒక పటాన్ని ఉపయోగించి చూపుతాను (పటాన్ని చూడు).

పటంలోని ఆయాభాగాలను చూడు. మొదట, పైన "పాతాళము" (అదృశ్యలోకము) అనే పేరును గమనించు. ధనవంతుడు "పాతాళములో" ఉండి "తన కన్నులెత్తి" (లూకా 16:23) అని ఉంది. మృతుల స్థితిని బైబిలు "పాతాళము" అని అన్నది. "HADES" అనేది గ్రీకు పదం, అది *Sheol* అనే హెబ్రీ పదానికి దాదాపు అణుగుణంగా ఉంటుంది.[15] *(Hades)* "పాతాళము" అనే మాట ప్రాథమికంగా, "అదృశ్యలోకాన్ని" [16] సూచిస్తుంది. లూకా 16లో ఉపయోగించినట్టు, Thayer ఆ పదానికి నిర్వచన మిచ్చాడు: "దేహములేని ఆత్మలు సాధారణంగా వేచియుండు చోటు."[17] నేడు, "పాతాళాన్ని" "నరకంగా" ఉపయోగించడం జరుగుతుంది. "నరకము" (*gehenna*) దుష్టులైన మృతుల నిత్యత్వపు స్థితి. "పాతాళము,"[18] అనేది – మంచివారేమి, చెడ్డవారేమి – మృతులైనవారి మధ్యస్థ స్థితి.

పటమువైపు చూడు. అదృశ్యలోకంలో రెండు భాగాలున్నాయి. వీటిలో ఒక దానియందు లాజరు ఉన్నాడు, మరోదానిలో ధనవంతుడున్నాడు. మధ్యలో **"మహా**

**అగాధం"**[19] కూడ ఉంది. ధనవంతుని స్థితితో ఆరంభించి, ఒక్కొక్క దానిని కొంత వివరంగా చూద్దాం. "అప్పుడతడు పాతాళములో బాధపడుచు, కన్నులెత్తి" అని ఉంది (లూకా 16:23ఎ). ధనవంతుని పరిస్థితిని నేను "బాధింపబడు" అని సూచించాను.




"బాధింపబడు" అను మాటక్రింద టార్టారస్ అన్నది నీవు గమనించవచ్చు. అదే కాకపోయినా, 2 పేతురు 2:4 అలాటిదాన్ని వర్ణిస్తుంది: "దేవదూతలు పాపము చేసినప్పుడు, దేవుడు వారిని విడిచిపెట్టక. పాతాళమందలి కటిక చీకటిగల బిలములలోనికి త్రోసి, తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను." Tartaras అనే గ్రీకు పదం[20] "దుష్టులు బాధింపబడడానికి నిర్బంధింపబడిన చోటు."[21] వారికి "తీర్పు" యింకా జరుగలేదన్న సంగతి గమనించు. గనుక, అది "తీర్పు" దినానికి ముందు ఉన్న స్థితి. నేను చెప్పినట్టు, పరిస్థితి అలాగే ఉన్నట్టు కన్పిస్తుంది. ఏ స్థితిలో ధనవంతుడు నిర్బంధింపబడ్డాడో అదే స్థితి కాకపోవచ్చు.

ఇప్పుడు లాజరు ఉన్న స్థితిని చూడ తిరుగుదాం. ఈ స్థితిని నేను **"అబ్రాహాము రొమ్ము"** అని సూచించాను – ఎందుకంటే "దూరమునుండి అబ్రాహామును అతని రొమ్మున (ఆనుకొనియున్న) లాజరును చూచి" (లూకా 16:23బి). "రొమ్ముననున్న" అంటే, సమీపముననున్న, సహవాసానికి సంప్రదింపులకు [22] అనువుగా ఉంటుంది. లాజరు మాత్రం సంతోషంగా, సమాధానంగా ఉన్నట్టు కన్పిస్తుంది. తీర్పుకొరకు వేచియుండే నీతిమంతుల స్థితి – అది.

**"అబ్రాహాము రొమ్ము"** అనే పదాల క్రింద లేక "పరదైసు" అని వ్రాశాను. క్రీస్తు ప్రభువు అదృశ్య లోకంలోనికి విహారయాత్రకు వెళ్లిన దానినుండి ఈ పదం వచ్చింది (లూకా 23:43). "పరదైసు" – అనేది పారసీక భాషా పదం – "వినోదపు భవనం" లేక "వినోదపు తోట" అనే అర్థమిస్తుంది.[23] కొన్నిసార్లు, బైబిల్లో ఈ పదం పరలోకాన్ని

సూచించడానికి వినియోగింపబడింది (ప్రకటన 2:7 చూడు) – కాని యిక్కడి విషయం మాత్రం అది కాదు, ఎందుకంటే – ప్రభువు కొద్దిసేపు పరదైసులో ఉండివచ్చిన మీదట, “నేను ఇంకను తండ్రి యొద్దకు ఎక్కి పోలేదు” అని ఆయన అన్నారు (యోహాను 20:17). పెంతెకొస్తు దినమున, పేతురు ప్రసంగములో, క్రీస్తు దేహము సమాధిలో ఉన్నట్టును, ఆయన ఆత్మ పాతాళంలో ఉండినట్టును సూచింపబడింది (అపో. 2:31).[24] లూకా 23:43ను; అపో. 2:31ని దగ్గరకు తెచ్చి, క్రీస్తు ఆత్మ “పరదైసు” అనే పేతురుతో ఉన్న అదృశ్యలోకములోనికి వెళ్లినట్టు తెలుస్తుంది. అందువలన, ఈ “పరదైసు” అనేది “అబ్రాహాము రొమ్ము” అనేదానికి సమము అన్నట్టు తేలుతుంది. మరోవిధంగా చెప్పాలంటే, – ఈ రెండు లేఖన భాగాలు చనిపోయిన నీతిమంతుల స్థితిని చాటుతుంది – తీర్పుకు వారు వేచియున్న స్థితి అది. ఆ స్థితి శాంతి, సంతోషము, భద్రతలతో కూడినదైయున్నట్టు కన్పిస్తుంది.

తీర్పుకొరకు వేచియుండడంలో రెండు స్థితులు ఉన్నట్టు – ఒకటి శాంతి భద్రతలతో కూడిందిగాను మరొకటి వేదనకరమైనదిగాను – గుర్తించిన మీదట నీకు ప్రశ్న రావచ్చు: “నీతిమంతులు సంతోషంగాను, దుష్టులు వేదింపబడడంతోను యిప్పటికే ఉన్నట్టయితే, తీర్పు దినము యొక్క అవసరత ఏమి?”[25] ఈ లోకం దాటి ఉండబోయే జీవితాన్ని చర్చించ ప్రయత్నించడంలో, గర్భ వాసానంతరం జీవితం ఎలా ఉండబోతుందో ఊహించుతున్న యిద్దరు యింకా పుట్టని శిశువులతో పోల్చవచ్చుననుకుంటాను. మన జవాబులు మన విషయ పరిజ్ఞానలేమిని వ్యక్తపరస్తూ ఉంటాయి. ఏదియెలాగున్నా. తీర్పుదినం దోషాన్ని తీర్మానించే దినమైయుండక, తీర్పు ప్రకటించే దినమైయుంటుంది – దేవుని నీతి (కనికరము) న్యాయములు పరిపూర్ణంగా ప్రదర్శించే దినమైయుంటుంది.

అయినా, అంతిమ జవాబు, మనము “వేదనకరమైన స్థితి,” “అబ్రాహాము రొమ్ము” అనేవాటిని గ్రహించడంలో, మనం స్థలాలను గూర్చి మాట్లాడడం లేదు, స్థితులను గూర్చి మాట్లాడుతున్నాం. దుర్నీతి సంబంధమైన ఆత్మ ఎక్కడ ఉండడం తటస్థించినా, తీర్పు దినాన తాను లోటుగలవాడైయున్నట్టు కనబడుదునని ఎరిగి, దానికై తాను వేచియుండగా వేదనపడుతూ ఉంటాడు. నీతిమంతుని ఆత్మ ఉండేది ఎక్కడైనా, “– భళా, నమ్మకమైన మంచి దాసుడా ...” అని దేవుడు తీర్పు దినమందు తనతో చెప్పునని ఎరిగి (మత్తయి 25:21ఎ, 23ఎ KJV), తాను వేచియుంటుండగా సంతోషంగాను నెమ్మదిగాను ఉంటాడు.

ఈ క్రింది ఉదాహరణ సహాయపడవచ్చు లేకపోవచ్చు. ఘోరమైన నేరం మోప బడిందనుకో: తీర్పుకొరకు వేచియున్నావు, సరియైన తీర్పు చెప్పబడి అమలు చేయబడుతుందని నిస్సందేహంగా ఎరిగియున్నావనుకో. నీవు నిర్దోషివైతే, సంపూర్ణంగా న్యాయం చేయబడతావు. ఈ నిశ్చయతతో సంతోషంగా నెమ్మదిగా నీవు ఉంటావు. అయినా, నీవు దోషివైతే మాత్రం భయము, ఆందోళన నిన్ను అలుముకొంటుంది. ఈ ఉదాహరణ ఏ మాత్రమూ పరిపూర్ణమయ్యింది కాదు, కాని చివరి తీర్పుకు ముందు రెండు వ్యత్యాసమైన మానసిక స్వభావాలు కనీసం అందులో కన్పిస్తాయి.

నా పటాన్ని చూచినవారు తొలిచూపులో, ఇది “పర్గెటొరి భావాన్ని పోలి లేదా?”

అని అడుగవచ్చు. తప్పక లేదు. "పర్గెటొరి" భావన సంపూర్ణంగా లేఖన దూరం. అలాటి పదం బైబిల్లో మచ్చుకైన కన్పించదు.[26] పర్గెటొరి అనే ఉపదేశంలో – ఆత్మ వేదనకరమైన స్థితినుండి మహాదానందమైన స్థితిలోనికి వెళ్లవచ్చుననే ఉద్దేశం ఉంటుంది. "మరోవిధంగా చెప్పాలంటే" మరణానంతరం మనిషికి మరో అవకాశముందని ఈ సిద్ధాంతం బోధిస్తుంది. పటమువైపు మరోసారి చూచి, ఆ మధ్యనున్న "మహా అగాధాన్ని" గమనించు. ధనవంతునితో అబ్రాహాము – "అంతేకాక ఇక్కడనుండి మాయొద్దకు దాట గోరువారు దాటి పోజాలకుండునట్లును, అక్కడి వారు మాయొద్దకు దాటి రాజాలకుండునట్లును, మాకును మీకును మధ్య అగాధముంచబడియున్నదని చెప్పెను" (లూకా 16:26). మరణానంతరం "రెండవ అవకాశం" లేదని బైబిలు బోధిస్తుంది:

- ప్రకటన 2:10. ఒకడు "మరణమువరకు" నమ్మకముగా ఉన్నట్టయితే, అతనికి ప్రభువు "జీవకిరీటము" నిస్తారు.
- 2 కొరింథీ. 5:10. "ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించినవాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" – అంతేగాని, తాను దేహమును విడిచిన తరువాత యితరులు తన పట్లచేసే క్రియలను బట్టికాదు.
- యోహాను 8:21. ఒకడు తన పాపములలోనే ఉండి చనిపోయినట్లయితే, ప్రభువు ఉండేచోటికి అతడు రాలేడు.

## ముగింపు

"మృతులు ఉండేదెక్కడ?" అనే ప్రశ్నకు బైబిలు జవాబుగా నేను నమ్మినదాన్ని మీతో పంచుకున్నాను. ఇది మాత్రమే దేవుడు మనకు బయలుపరచడానికి యిష్టపడ్డారు. దీనితో మనం సంతృప్తి చెందాలి. ముగించుతుండగా, ఈ ప్రశ్నను ప్రాక్టికల్‌గా, ఎక్కువ వ్యక్తిగతంగా ఆలోచింప గోరతాను. రాబోయే అయిదు నిమిషాలలో నీవు మరణించి నట్టయితే ఎక్కడ ఉండబోతావు? ఇది నీకు తప్పక పట్టినట్టుండాలి.

తనయందు విశ్వాసముంచుమని (యోహాను 8:24), మీ పాపముల విషయమై మారుమనస్సు పొందుమని (లూకా 13:3), ఆయనయందు మన విశ్వాసాన్ని బహిరంగంగా ఒప్పుకోమని (మత్తయి 10:32); పాపక్షమాపణ నిమిత్తము నీట ముంచబడాలని (మార్కు 16:16; అపొ. 2:38; రోమా 6:3–6) ప్రభువు మనకు చెప్పుతున్నారు. అక్కడనుండి అనుదినం మన జీవితాంతంవరకు తనతో నడువవలసి యుంటుంది (ప్రకటన 2:10). నీవు ఈ కార్యాలు జరిగించావా? విశ్వాసపు విధేయతతో నీ జీవితాన్ని కొనసాగిస్తున్నావా? నీ జవాబు "లేదు" అనేది అయితే, నీవు తక్షణమే ప్రభువుకు లోబడు. దీనికంటె ముఖ్యమైనదేదియు లేదు!

## నోట్సు

ఈ ప్రసంగంలో క్రొత్తదనం ఏమీ లేదు. మార్పులతో యిదే సంగతి నమ్మకమైన సువార్తికులు ప్రసంగిస్తునే ఉన్నారు. నాకు మూలాలు గుర్తు లేనందున, ఈ అంశం మీద ప్రసంగించిన, రచించిన వారికందరికి "వందనాలు" తెలుపుతున్నా.

ఈ ప్రసంగం పెద్దదనుకుంటే "పర్గెటొరి" భాగాన్ని విడిచి పెట్టవచ్చు. ఈ సంగతులను రెండు టాపిక్స్‌గా చేయవచ్చు.

ఇటీవలి వరకు, ఈ ప్రసంగంలోని తీర్మనాలను అంగీకరింపని సహోదరులున్న సంగతి నేను ఎరుగకున్నాను – క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాన్ని బట్టి, – నీతిమంతులైన మృతులు నేరుగా పరలోకం వెళ్లతారని వారు నమ్ముతారు. వీరి గౌరవార్థం "మృతులైన నీతిమంతులు నేరుగా పరలోకం వెళ్లతారా?" అనే ఒక సహాయపు వ్యాసం యిందులో చేర్చుతున్నాను. లూకా 16:19–31 నేటికిని నిజమేనని భావించేవారికి యిది వ్యర్థంగా కన్పించదు. అది నేడు వర్తించదు అనేవారు వారి వాదానికి నేను సరిగా బదులివ్వలేదని తలంచుతారు. పిలాతు మాటలను అప్పు తెచ్చుకొంటూ, "నేను వ్రాసినదేమో వ్రాసితిని" (యోహాను 19:22).

---

సూచనలు

[1]మృతులైన జనుల ఆత్మలచేత మనం ఆవరింబడ్డామని ఉపదేశించడానికి కొందరు హెబ్రీ. 12:1ని ఉపయోగించారు. క్రైస్తవ జీవితంలో పట్టువీడక ఉండాలనడానికి హెబ్రీ. 12:1–4 పందెపు రంగాన్ని పోలికగా ఉపయోగించింది. ఉదాహరణలో ఉన్న వివరాలను తీసి, విపరీతమైన సిద్ధాంతాలుగా వాటిని శాసించకూడదు. [2]లూకా 16లో లాజరు, యోహాను 11లోని లాజరు కాదు. [3]"క్రీస్తు జీవితం, 4"లో "నరకంనుండి లేఖ"ను చూడు. [4]"క్రీస్తు జీవితం, 4"లో లూకా 16:19–31 "ఉపమానమో" కాదో చూడు. [5]యేసు చెప్పిన విషయం పై వ్యాఖ్యానానికి "క్రీస్తు జీవితం, 4"ను చూడు. [6]"ఉపమానం" అనే పదమును గూర్చిన చర్చకు "క్రీస్తు జీవితం, 3"ను చూడు. [7]లూకా 16లోని మృతుల పరిస్థితి క్రీస్తు మరణానికి ముందు సరియేగాని, క్రీస్తు మరణానంతరం కాదనేవారు ఉన్నారు. దీనిని "నీతిమంతులు నేరుగా పరలోకం వెళ్లతారా?" అనేదానిలో చర్చించుదాం. [8]వీరు ఈ విధంగా చెప్పవచ్చు, "సమాధిలో" – అయితే శరీరం నశించి మంటిలో కలిసిపోతున్నందున వారి ఆఖరి జవాబు "ఎక్కడా లేరు" అనేది. [9]మన పాపములు దేవునినుండి మనలను ఎడబాటు చేసినందున (యెషయా 59:1, 2), మనం పాపములో చచ్చినవారమైయుంటిమి (ఎఫెసీ. 2:1). మన శరీరము నుండి ఆత్మ వేరైపోయినప్పుడు మనం భౌతికంగా చనిపోయాం (యాకోబు 2:26). "నిత్యత్వంలో నరులు దేవునినుండి వేరు చేయబడడాన్ని రెండవ మరణము" అని అంటారు (ప్రకటన 20:14; 2 థెస్స. 1:9). [10]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament*, trans. and rev. Joseph H. Thayer (Edinburgh, Scotland: T. & T. Clark, 1901; reprint; Grand Rapids, Mich.: Baker Book House, 1977), 677.

[11]Thayer, 520. [12]క్రీస్తు సిలువలో మరణించినప్పుడు పరిస్థితులు మార్పు చెందాయి – లూకా 16 నేటి దినానికి వర్తించదు అనే విషయాన్ని "మృతులైన నీతిమంతులు నేరుగా పరలోకానికి వెళ్లతారా?" అనే పాఠములో చూడు. [13]అదృశ్య లోకమును గూర్చి ఇలాంటి అభ్యంతరాన్నే తెలిపారు. "మృతులైన నీతిమంతులు నేరుగా పరలోకానికి వెళ్లతారా?" అనే పాఠములో ఈ విషయాన్ని ఆలోచించుదాం. [14]"మృతులైన నీతిమంతులు నేరుగా పరలోకానికి వెళ్లతారా?" అనే పాఠములో ఈ విషయాలను ఎక్కువగా ఆలోచిద్దాం. [15]మృతుల స్థితిని గూర్చి క్రొత్త నిబంధనకంటె పాత నిబంధన తక్కువగా చెప్తుతుంది *Sheol* అనే హెబ్రీ పదం సాధారణమైనది, *Hades* అనే గ్రీకు పదం కంటె – *Sheol* సమాధిని తరచుగా సూచిస్తుంది.

[16]Thayer’s Lexicon, 11లో, “కనిపించనిది” అని ఉంది. [17]Thayer, 11. [18]“హేడీస్” అనే గ్రీకు పదానికి “నరకం” అని KJV తర్జుమా చేసింది. లూకా 16:23లో అలా జరిగింది. [19]“మహా అగాధం” అని KJVలో ఉంది (మార్కు 16:26). [20](నరకములో KJV) “పాతాళములోనికి త్రోసివేసి” అని తర్జుమా చేయబడిన క్రియా రూపమునకు “టార్టారన్” నకు అప్పగించెను (తీర్పుకు ముందు దుష్టులు బాధింపబడడాన్ని నిర్బంధింపబడిన స్థలమును సూచించినది).

[21]*The Analytical Greek Lexicon* (London: Samuel Bagster & Sons Ltd., 1971), 398. [22]భోజనానికి కూర్చుండే ఆనాటి అలవాట్లలోనుండి ఈ అలంకారం వచ్చియుండవచ్చు. ఇంటి యజమానుని కుడివైపున కూర్చుండడం (అతి గౌరవమైన చోటు) “రొమ్మునను్న” అని చెప్పబడింది (యోహాను 13:23, 25; 21:20; యోహాను 1:18). [23]సెప్టూజెంటులో “పరదైసు” అనేది ఏదెను తోటను చూపడానికి ఉపయోగింపబడింది. [24]KJVలో “నరకం” అని ఉంది అయితే అపొ. 2:31లోని గ్రీకు పదం హేడీస్‌లోని ఒక స్థితిని సూచిస్తుంది. [25]“మృతులైన నీతిమంతులు నేరుగా పరలోకానికి వెళ్లతారా?” అనే పాఠములో ఎక్కువ విషయాలను చెప్పుతాను. మృతుల మధ్యస్థ స్థితిని నమ్మేవారికి చెప్పుట కష్టం. నీతిమంతులు నేరుగా పరలోకానికి వెళ్లతారని నమ్మేవారికి చెప్పుట కష్టం కాదు. [26]Purgatory అనే లాటిన్ పదానికి “శుద్ధీకరించు” అని అర్థం. అది రోమన్ కథోలిక్ సిద్ధాంతం. భూమిమీదనున్న బంధువులు చచ్చినవారిపట్ల (వారిపేరిట) సత్క్రియలు చేస్తే అవి వారి నిత్యత్వం మీద ప్రభావం చూపుతుందనే తప్పు సిద్ధాంతం. ఆ మతానికి యిది ఆదాయ మార్గం.